క్లుప్తంగా

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు



కాట్రావులపల్లిలో యువతకు సూచనలిస్తున్న డీఎస్పీ శ్రీహరిరాజు

జగ్గంపేట: సంక్రాంతిని పురస్కరించుకుని గ్రామాల్లో ఎవరైనా కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు హెచ్చరించారు. మండలంలో గతేడాది కోడి పందేలు జరిగిన ప్రాంతాలను గురువారం ఆయన పరిశీలించారు. సంక్రాంతి సందర్భంగా ఈ ఏడాది కూడా ఇవే ప్రాంతాల్లో కోడిపందేలు జరుగుతాయని ప్రచారం నేపథ్యంలో పోలీసులు ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీహరిరాజు మాట్లాడుతూ కోడిపందేలు జరిగే ప్రాంతాలపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. ఎవరైనా కోడిపందేలు ఆడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కాట్రావులపల్లి గ్రామ శివారు పూడిచెరువు, రాజపూడి, జగ్గంపేట శివారు ఆయిల్ పామ్ తోట, తదితర ప్రాంతాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, ఎస్సై రఘునాథరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ



గండేపల్లిలో ప్రతిష్ఠించిన సత్తెమ్మతల్లి విగ్రహం

గండేపల్లి: స్థానిక కృష్ణుని వీధిలో పునర్నిర్మించిన సత్తెమ్మతల్లి ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. పండితులు ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. కాగా వచ్చే నెలలో అమ్మవారి జాతర నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, మాజీ వైస్ ఎంపీపీ పోతుల మోహన్‌రావు, మురారి ఉప సర్పంచ్ జాస్తి వసంత్, గండేపల్లి మాజీ సర్పంచ్ లంజపల్లి రామకృష్ణ, నేతలు సుంకవల్లి రమేష్, వెంపాటి రాజు తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రంలో కంప్యూటర్ చోరీ

రౌతులపూడి: మండలంలోని బలరామపురం రైతు సేవా కేంద్రంలో కంప్యూటర్‌ను గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. బుధవారం సాయంత్రం ఎప్పటిలాగే సిబ్బంది తమ విధులు ముగించుకుని రైతు సేవా కేంద్రానికి తాళాలు వేసి వెళ్లారు. గురువారం ఉదయం విధులకు వచ్చేసరికి కార్యాలయం తలుపు తాళం బద్దలుకొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా కార్యాలయంలోని కంప్యూటర్ చోరీకి గురైనట్లు గుర్తించారు. దీనిపై స్థానిక అగ్రికల్చర్ అసిస్టెంట్ సతీష్ మండల వ్యవసాయాధికారి ఈశ్వరరావుకు సమాచారం అందించారు. ఈ ఘటనపై రౌతులపూడి పోలీసులకు ఫిర్యాదు చేశామని ఏఓ తెలిపారు.

నేడు శ్రీవారి పాదాల ప్రతిష్ఠ

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం శ్రీవారి పాదాలు ప్రతిష్ఠించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఆలయ ధర్మకర్తలు గురువారం తెలిపారు. తెల్లవారుజామున నాలుగు గంటలకు జరిగే ప్రతిష్ఠాపన మహోత్సవంలో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలన్నారు.

లక్ష్మీనారాయణ హోమం

టి.తిమ్మాపురం మహావిష్ణు ఆలయంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా గురువారం నగర సంకీర్తన, లక్ష్మీనారాయణ హోమం వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించి, పూజలు చేశారు.

పశువులను తరలిస్తున్న వాహనం సీజ్

ప్రత్తిపాడు: బొలెరో వాహనంలో అక్రమంగా ఎద్దులను తరలిస్తుండగా పోలీసులు వెంటాడి పట్టుకున్న ఘటన గురువారం రాచపల్లిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. తుని నుంచి రాజమహేంద్రవరం వైపు బొలేరో వాహనంలో ఎనిమిది ఎద్దులను తరలిస్తున్నారు. ప్రత్తిపాడు జాతీయ రహదారిపై పోలీసు వాహనాన్ని గమనించిన బొలెరో డ్రైవర్ తన వాహనాన్ని రాచపల్లి వైపు మళ్లించి అతి వేగంగా దూసుకుపోతున్నాడు. గేదెల వాహనాన్ని వెంబడించిన పోలీసులు రాచపల్లి సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. ఎనిమిది ఎద్దులను మండలంలోని ఉలిగోగుల గిరిజన గ్రామంలోని గోశాలకు తరలించి, వాహనాన్ని సీజ్ చేశామని ప్రత్తిపాడు ఎస్సై ఎస్. లక్ష్మీకాంతం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అక్రమంగా ఆవులు, గేదెలు, ఎద్దులను తరలిస్తే దండన తప్పదని హెచ్చరించారు.

వసూల్‌మే సవాల్ !

- గ్రామాల్లో పేరుకుపోతున్న ఆస్తిపన్ను బకాయిలు
- తొమ్మిది నెలలుగా వసూళ్లలో కాలయాపన
- రూ.6 కోట్లకు పైగా పాత, కొత్త డిమాండ్



ఎస్.అన్నవరం మేజర్ పంచాయతీ మెయిన్ రోడ్డులో ఇళ్లు

తుని రూరల్: గ్రామాల్లో గృహ, గృహేతర పన్నుల బకాయిలు పేరుకుపోతున్నాయి. రూ.కోట్లలో బకాయిలు పెరుగుతున్నా వసూళ్లపై అధికారులు శ్రద్ధ చూపడం లేదు. 2024–25 ఆర్థిక సంవత్సరం ప్రారంభమై తొమ్మిది నెలలు గడుస్తున్నా ఇంకా ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ పూర్తికాలేదంటూ కాలయాపన చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాలతో గత నెల 25 నాటికి ఇళ్ల మ్యాపింగ్ పూర్తి చేశారు. కొన్ని పంచాయతీల్లో గృహ యజమానులు స్వచ్ఛందంగా సచివాలయాలకు వెళ్లి పన్నులు చెల్లిస్తున్నారే తప్పా సిబ్బంది వసూళ్లకు గడప దాటడం లేదు. మరికొన్ని పంచాయతీల్లో నేటి డిమాండ్ నోటీసులు సిద్ధం చేయలేని పరిస్థితులు నెలకొన్నాయి.

రూ.1.78 కోట్లకు పైగా పాత బకాయిలు

నియోజకవర్గంలో తుని, తొండంగి, కోటనందూరు మండలాల్లో గృహ, గృహేతర పన్ను బకాయిలు, 2024–25 ఆర్థిక సంవత్సరం డిమాండ్ రూ.కోట్లకు చేరింది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వసూలు కాని గృహ, గృహేతర పాత బకాయిలు రూ.1.78 కోట్లకుపైగా ఉంది. ఈ ఆర్థిక సంవత్సరం వసూలు చేయాల్సిన డిమాండ్ రూ.నాలుగు కోట్ల వరకు ఉంది. పాత, కొత్త డిమాండ్ మొత్తంగా ఆరు కోట్లు వసూలు చేయాల్సి ఉంది. స్వచ్ఛందంగా చెల్లించిన మొత్తం రూ.లక్షల్లో ఉన్నట్టు తెలుస్తుంది.

పన్నుల విభజన

2024 ఆర్థిక సంవత్సరం వరకూ గ్రామాల్లో ఏకమొత్తంగా పన్నుల వసూలు చేసిన అధికారులు ఈ సంవత్సరం నుంచి ఐదు విభాగాలు పన్ను వసూలు చేపట్టేందుకు డిమాండ్ నోటీసులు తయారు చేశారు. ఇంటి పన్ను, నీటి పన్ను, గ్రంథాలయ సెస్సు, లైటింగ్ పన్ను, డ్రైనేజీ పన్నులను చూపుతూ ఏకమొత్తంగా డిమాండ్ నోటీసులు రూపొందించారు. ఇంటి పన్ను మొత్తంలో పది శాతం నీటి పన్ను, ఎనిమిది శాతం గ్రంథాలయ సెస్సు, ఐదు శాతం లైటింగ్, మరో ఐదు శాతం డ్రైనేజీ పన్నుగా పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం ఐదు శాతం పన్ను పెంచుతూ వసూళ్లు చేయనున్నట్టు అధికారులు తెలిపారు.

నియోజకవర్గంలో 2023-24 సంవత్సరంలో మండలాల వారీగా బకాయిలు

మండలం	సచివాలయాలు	ఇంటి పన్ను బకాయిలు	గృహేతర పన్ను బకాయిలు
తుని	23	రూ.6968302	రూ.715212
తొండంగి	22	రూ.4159122	రూ.2930754
కోటనందూరు	17	రూ.1981707	రూ.1097764

వంద శాతం వసూలు చేస్తాం

బకాయిలతో సహ ఈ సంవత్సరం డిమాండ్ ఆస్తి పన్నులను వందశాతం వసూలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇటీవల ఇంటింటా గృహ మ్యాపింగ్, డిమాండ్ రసీదుల తయారీ పూర్తయ్యింది. ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తికావస్తుంది. పూర్తయిన తర్వాత ఇంటి వద్ద నుంచే నేరుగా ఆన్‌లైన్‌లో ఆస్తి పన్ను చెల్లించే వెసులుబాటు లభిస్తుంది. ప్రస్తుతం పన్ను వసూళ్లకు వెళ్తాంటే జనవరి తర్వాత చెల్లిస్తాంటున్నారు.

– మరిడియ్యా, ఈఓపీఆర్‌డీ, తుని

షెడ్యూల్ కులాల జాబితా ప్రదర్శన



రేఖవానిపాలెంలో షెడ్యూల్ కులాల జాబితాను ప్రదర్శిస్తున్న వీఆర్వో, కార్యదర్శులు

తుని రూరల్: షెడ్యూల్ కులాల జాబితాపై సామాజిక తనిఖీల జాబితాలను గ్రామ సచివాలయాల్లో ప్రదర్శించినట్టు ఎంపీడీఓ కె.సాయి నవీన్ తెలిపారు. గురువారం నుంచి అన్ని సచివాలయాల్లో ప్రజలకు జాబితాలు అందుబాటులో ఉంటాయన్నారు. అభ్యంతరాలు ఉంటే ఈ నెల 31వ తేదీలోగా రాత పూర్వకంగా గ్రామ రెవెన్యూ అధికారి, పట్టణ వార్డు రెవెన్యూ సెక్రటరీలకు అందజేయాలన్నారు. జనవరి ఆరో తేదీ వరకు ఆన్‌లైన్‌లో అభ్యంతరాలు తెలపవచ్చన్నారు. వీఆర్వో, తహసీల్దార్, ఉన్నతాధికారుల పరిశీలన అనంతరం షెడ్యూల్ కులాల తుది జాబితాను జనవరి 10న ప్రకటించనున్నట్టు ఆయన వివరించారు.

ఖాతాదారుల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న కో–ఆపరేటివ్ ఇనిస్టిట్యూట్ స్టేట్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్

కోటనందూరు: ఖాతాదారుల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా సొసైటీ పని చేయాలని కో–ఆపరేటివ్ మేనేజ్‌మెంట్ ఇనిస్టిట్యూట్ స్టేట్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ఎల్ఎన్‌టీ శ్రీనివాస్ అన్నారు. స్థానిక కో–ఆపరేటివ్ సొసైటీని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక క్రమశిక్షణ, సొంతంగా నిధులు సమకూర్చుకోవడం వంటి అంశాలపై దృష్టి సారించాలన్నారు. సంఘ సభ్యుల అవసరాల మేరకు ప్రణాళికలు తయారు చేసుకుని సంఘాన్ని అభివృద్ధి బాటలో నడిపించుకోవాలని సూచించారు. వచ్చే ఐదేళ్లలో కేంద్ర సహకార శాఖ 2 లక్షల కొత్త సహకార సంఘాలను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. డెయిరీ, ఫిషరీ సహకార సంఘాలను గ్రామీణ స్థాయిలో ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు చెప్పారు. సహకార సంఘాల బలోపేతానికి కేంద్ర సహకారశాఖ చేపట్టిన వివిధ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీసీసీబీ మేనేజర్ కె.ధనలక్ష్మి, సూపర్‌వైజర్ అలమండ కొండబాబు, సీఈఓ ఎలిశెట్టి వీరభద్రరావు, సిబ్బంది అప్పలరాజు, దొంగబాబు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో బుధవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. యూనివర్సిటీ డ్రైవర్స్, నాన్ టీచింగ్ సిబ్బందికి వాసన్ హాస్పటల్ డాక్టర్లు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లజోళ్లు అందజేసినట్టు కళాశాల డిప్యూటీ ప్రోచాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో డీన్ వి.సత్యనారాయణ, ప్రోగ్రాం కన్వీనర్ బీహెచ్‌వీ వరప్రసాద్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ ఐవీ వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నిరసనను విజయవంతం చేస్తాం



కిర్లంపూడిలో ముద్రగడ పద్మనాభం, గిరిబాబును కలసిన అభిమానులు

కిర్లంపూడి: విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నేత ముద్రగడ పద్మనాభం, వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి ముద్రగడ గిరిబాబు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించే పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని ఆ పార్టీ నాయకులు తెలిపారు. ప్రత్తిపాడు నియోజకవర్గం ఏలేశ్వరం పట్టణానికి చెందిన మాజీ జెడ్పీటీసీ, మున్సిపల్ వైస్ చైర్మన్ శిడగం వెంకటేశ్వరరావు, కో ఆప్షన్ సభ్యులు వాగు బలరాం, షేక్ దిల్బర్ హుస్సేన్, దాకమరి లోవరాజు, సీహెచ్‌సీ మాజీ చైర్మన్ జువ్వెన వీర్రాజు, బదిరెడ్డి గోవిందు, సామంతుల సూర్యకుమార్‌తో పాటు పలు గ్రామాల నుంచి వచ్చిన నాయకులు కిర్లంపూడిలోని ముద్రగడ పద్మనాభం నివాసంలో గురువారం ఆయనను, యువనాయకుడు గిరిబాబును మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 6 నెలలకే ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపిందన్నారు. విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తు వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు శుక్రవారం ఆందోళన చేపడుతున్నట్టు తెలిపారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలోని విద్యుత్ వినియోగదారులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శుక్రవారం ఉదయం 8 గంటలకు కిర్లంపూడి తమ నివాసం వద్దకు చేరుకోవాలని ఆయన కోరారు. అనంతరం భారీ ర్యాలీగా ప్రత్తిపాడు విద్యుత్ సబ్‌స్టేషన్‌కు చేరకుని వినతిపత్రం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బొండు రాంబాబు, ఎంపీటీసీ అమరాది కాశీ, శెట్టి సత్తిబాబు, రేఖ శ్రీను, రేఖ కృష్ణార్జునుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపుపై నేడు ఆందోళన

తుని: వైఎస్సార్ సీపీ అధిష్ఠానం పిలుపు మేరకు విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ తుని నియోజకవర్గ కో ఆర్డినేటర్ దాడిశెట్టి రాజా ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన నిర్వహించనున్నట్టు ఆ పార్టీ తుని పట్టణశాఖ అధ్యక్షుడు రేలంగి రమణా గౌడ్ గురువారం తెలిపారు. ఉదయం 10 గంటలకు తుని టౌన్ శ్రీరామా సెంటర్లోని వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పించి ర్యాలీ ప్రారంభిస్తారన్నారు. జీఎన్‌టీ రోడ్డు, గొల్లఅప్పారావు సెంటర్, మెయిన్ రోడ్డు, బాలాజీ సెంటర్ మీదుగా వీరవరపుపేటకు చేరుతుందన్నారు. తుని టౌన్ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించి నిరసన తెలియజేస్తారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆందోళనలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

జయప్రదం చేయాలి



తోట నరసింహం

కిర్లంపూడి: ప్రజలపై విద్యుత్ భారాన్ని తగ్గించాలని కోరుతూ శుక్రవారం జగ్గంపేటలో నిర్వహించే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలపై అధిక మొత్తంలో విద్యుత్ చార్జీలు పెంచిందన్నారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు విద్యుత్ చార్జీలు తగ్గించాలనే డిమాండ్‌తో ఉదయం 9 గంటలకు జగ్గంపేటలో ఆందోళన నిర్వహిస్తున్నట్టు చెప్పారు. విద్యుత్ వినియోగదారులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

భూ సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి



భద్రవరం రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి

రౌతులపూడి: రెవెన్యూ సదస్సుల్లో వస్తున్న భూ సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పెద్దాపురం ఆర్డీవో శ్రీరమణి సూచించారు. మండలంలోని ఎస్.అగ్రహారంలో గురువారం డీటీ నరేష్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సును ఆర్డీఓ తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పట్టాదారు పాసుపుస్తకాలు, మ్యుటేషన్, భూ సర్వే తదితర సమస్యలపై అర్జీలు రాగా వాటిని పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ రాజశేఖర్, వీఆర్ఓ నాగేశ్వరరావు, విలేజ్ సర్వేయర్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

ఏలేశ్వరం: గ్రామాల్లో భూ సమస్యలు పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి తెలిపారు. మండలంలోని భద్రవరంలో గురువారం డిప్యూటీ తహసీల్దార్ కుశరాజు అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న భూసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రైతులకు ఎటువంటి సమస్యలు ఉన్నా అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కొప్పుల బాబ్జీ, సర్పంచ్ కూనపురెడ్డి సుబ్బారావు, నీటిసంఘం అధ్యక్షుడు చీమలరాంబాబు, జిగాటపు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

చార్లెస్ బాబేజ్ జయంతి వేడుకలు



ఏలేశ్వరంలో బాబేజ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మార్స్ నిర్వాహకుడు దుర్గారావు, ప్రయాగమూర్తి

ఏలేశ్వరం: కంప్యూటర్ పితామహుడు చార్లెస్ బాబేజ్ జయంతి వేడుకలను గురువారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక మార్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్వాహకుడు అడపా దుర్గారావు ఆధ్వర్యంలో బాబేజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఇన్‌చార్జ్ ప్రగడ ప్రయాగమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంప్యూటర్‌ను కనిపెట్టి బాబేజ్ ప్రపంచానికి గొప్ప పరిజ్ఞానాన్ని అందించారన్నారు. కంప్యూటర్ ద్వారా నేడు కోట్లాది ప్రజలు ఉపాధి పొందుతున్నారన్నారు. నేటి యువత ఆయన సేవలను మరువరాదన్నారు. కార్యక్రమంలో కోరాడ రాజు, బొప్పన శివ, కంపరపు సత్యేంద్ర, ఉప్పాడ అబ్బులు, ఉడతల రమణారావు, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు చేయూత



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నేత మురళీకృష్ణంరాజు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని చింతలూరు, పోతులూరు గ్రామాల్లో బాధిత కుటుంబాలకు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నేత ముదునూరి మురళీకృష్ణంరాజు చేయూతను అందించారు. చింతలూరుకు చెందిన పైల శ్రీరాములు, పోతులూరుకు చెందిన చిన్నం కామరాజు కుమారుడు అచ్చిరాజు ఇటీవల మృతి చెందారు. అలాగే పోతులూరుకు చెందిన చిన్నం ముసలయ్య కుమారుడు నాగార్జున అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆయా కుటుంబాలను గురువారం వైఎస్సార్ సీపీ నేత మురళీకృష్ణంరాజు పరామర్శించి తన ట్రస్ట్ తనపున ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడమే లక్ష్యంగా ట్రస్టును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొండి రాంబాబు, వైస్ సర్పంచ్ అల్లు అప్పలరాజు, మాజీ ఎంపీటీసీ సేనాపతి రాజు, వైఎస్సార్ సీపీ నాయకులు శెట్టి సత్తిబాబు, దేవ లక్ష్మణ్, పంచాది రామూర్తి, రేఖ బాబురావు, రేఖ కృష్ణార్జున, చెక్కపల్లి నాగేశ్వరరావు, బుజ్జిబాబు, బుర సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

వంగవీటి రంగాకు ఘన నివాళులు



ఏలేశ్వరంలో రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న యూత్ సభ్యులు

ఏలేశ్వరం: కాపు నాయకుడు, మాజీ ఎమ్మెల్యే వంగవీటి రంగా వర్ధంతిని గురువారం పట్టణంలో నిర్వహించారు. స్థానిక వైఆర్‌పీ క్వార్టర్స్ వద్ద గల రంగా విగ్రహానికి వంగవీటి రంగా యూత్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు మాట్లాడుతూ వంగవీటి రంగా ఆశయాలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కాపుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అడపా శేషగిరిరావు, మలిరెడ్డి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట: మండలంలోని కాట్రావులపల్లిలో కాపు నేత వంగవీటి రంగా వర్ధంతి నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మరోతి శివ గణేష్ ఆధ్వర్యంలో వంగవీటి రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు వత్సవాయి సత్యనారాయణ రాజు, చంద్రమౌళి వెంకటరత్నం చిన్నారి పాల్గొన్నారు.

పంట పొలాల పరిశీలన

కోటనందూరు: తుపాను ప్రభావంతో తడిచిన, నేల కొరిగిన వరి పొలాలను ఏడీఏ సుంకర బుల్లిబాబు గురువారం పరిశీలించారు. ముక్క(విరిగిన), రంగుమారిన ధాన్యం శాతం ప్రభుత్వం నిర్ణయించిన శాతం కంటె అధికంగా ఉన్నట్లు గుర్తించారు. రంగు మారిన ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అనుమతులు పొందేందుకు వాస్తవ పరిస్థితిని ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు. ఏఓలు చంద్రశేఖర్, వెంకటలక్ష్మి, ఏఈఓలు శివకుమారి, సురేష్ పాల్గొన్నారు.

1900 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రత్తిపాడు: మండలంలోని వేములపాలెంలో సారా స్థావరాలపై గురువారం ప్రత్తిపాడు ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 1,900 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు స్థానిక ఎక్సైజ్ సీఐ పి.శివ ప్రసాద్ తెలిపారు. సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ శివప్రసాద్ తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యాన సాగులో సస్యరక్షణ తప్పనిసరి



తాళ్లూరులో మామిడి రైతులకు సస్యరక్షణ చర్యలను వివరిస్తున్న హెచ్ఓ అరుణ్ కుమార్

తుని రూరల్: పండ్లు, కూరగాయల సాగు చేస్తున్న రైతులు తప్పనిసరిగా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యాన అధికారి అరుణ్ కుమార్ సూచించారు. మండలంలో తాళ్లూరు, తేటగుంట గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తుంది కార్యక్రమాలు నిర్వహించారు. త్వరగా పూత వచ్చేందుకు, ఆడపూల శాతాన్ని పెంచేందుకు పోటాషియం నైట్రేట్ పది గ్రాములు, రెండు గ్రాములు బోరాన్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. పూమొగ్గ దశలో తేనేమంచు పురుగు నివారణకు లీటరు నీటిలో క్లోరిపైరిపాస్ 2.5 మిల్లీ లీటర్లు కలిపి పూత మొదలయ్యే సమయం, పిందెలు తయారయ్యే సమయాల్లో పూత, పిందెలపైనే కాకుండా మొదళ్లు, కొమ్మలపై పిచికారీ చేయాలన్నారు. కూరగాయల పంటలను ఆశించే తెగుళ్లను గుర్తించి ఉద్యాన అధికారుల సలహా మేరకు మందులు పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఏఓ బి.అశోక్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



ఆలయ శంకుస్థాపనలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు, ముదునూరి మురళీకృష్ణంరాజు తదితరులు

ప్రత్తిపాడు: మండలంలోని చినశంకర్లపూడిలో సుబ్రహ్మణ్యస్వామి ఆలయ నిర్మాణానికి గురువారం గ్రామ సర్పంచ్ ఏపూరి రామారావు, నాగమణి దంపతులు శంకుస్థాపన చేశారు. గ్రామ పొలిమేరల్లో నల్లతాచు పాము పలుమార్లు తారసపడింది. దీంతో ఆ ప్రదేశంలో ఆలయ నిర్మాణం చేపట్టాలని భావించి, నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్టు సర్పంచ్ ఏపూరి రామారావు తెలిపారు. సుమారు రూ.25 లక్షల ప్రజల విరాళంతో ఆలయం నిర్మిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు, ఎంఎంఆర్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు, మాజీ ఎంపీటీసీ కోలా తాతబాబు, ఏపూరి సత్యనారాయణ, పిడుగు సత్యనారాయణ, బొల్లు నాగేశ్వరరావు, ఏపూరి కన్నబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

150 మంది జూదరుల గుర్తింపు

గండేపల్లి: మండల పరిధిలోని గ్రామాల్లో 150 మంది జూదరులను గుర్తించినట్టు స్థానిక ఎస్సై యువి శివ నాగబాబు గురువారం తెలిపారు. వీరిలో 24 మందిని తహసీల్దార్ కోర్టులో హాజరు పరిచి బైండోవర్ చేశామన్నారు. అనంతరం రెండు లక్షల పూచికత్తుతో విడిచిపెట్టినట్టు తెలిపారు. మంచి ప్రవర్తనతో మెలగాలని వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతు గ్రామాల్లో గుండాట, పేకాట, కోడి పందేలు, క్రికెట్ బెట్టింగ్ వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

జగ్గంపేట: విద్యుత్ లైన్ల మరమ్మతులు, వైర్లపై ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో డీఈ బి.వీరభద్రరావు గురువారం తెలిపారు. మండలంలోని రాజపూడి, మల్లిశాల, వెంగాయ్యమ్మపురం, గోవిందపురం, కృష్ణాపురం, సీతారాంపురం, జగ్గంపేట సీహెచ్‌సీ, బాలాజీ రైసు మిల్లు పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

కేంద్ర మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలి

ప్రత్తిపాడు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ శ్రేణులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మండలంలోని లంపకలోవలో లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు మానుకొండ లచ్చబాబు ఆధ్వర్యంలో లిబరేషన్ అనుబంధ సంస్థల కార్యకర్తలు ధర్నా చేశారు. అమిత్ షా రాజీనామా చేయాలని, వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లిబరేషన్ అనుబంధ సంస్థల నాయకులు రాజాల రత్నం, బీరా దేవ తయ్యా, చిట్టుమూరి ముసలయ్య, కొమ్ము మరియమ్మ, కింతాడ నూకాలమ్మ, మాసా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.